పోలీస్‌వ్యాన్ నుండి ఇన్‌స్పెక్టరు స్వరాజ్యరావు, క్రిమినల్ రికార్డునుండియుగంధర్,రాజు దిగి బంగళాలోనికి ప్రవేశించారు.

వీరిని చూస్తూనే ఆశ్చర్యంగా, "రండి" అంటూ ఆహ్వానించింది సరళాదేవి.

"క్షమించండి సరళాదేవి గారూ! మీ భర్త సచ్చిదానందగారిని విషప్రయోగంతో హత్యచేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను."అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. అవాక్కాయిపోయింది సరళాదేవి. ఆమె ముఖం పాలిపోయింది.

"కాని...కాని...హత్యజరిగే సమయానికి నేనక్కడలేను. సినిమాకు వెళ్ళి పదిగంటల ప్రాంతాన వచ్చాను." అన్నది ధృఢంగా!

"హత్యాసమయంలో నువ్వక్కడ లేకపోయినా ఈ హత్యచేసింది నువ్వే."చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

ఆ తర్వాత కొద్దిసేపట్లో నిజం వప్పుకొని లొంగిపోయింది సరళాదేవి.

మరుసటిరోజు సాయంత్రం యుగంధర్ యింట్లో టీ త్రాగుతూ, "సరళాదేవి యీ హత్యచేసిందని ఎలా వూహించారు మీరు?" అని ప్రశ్నించాడు స్వరాజ్యరావు.

"తన భర్త పొటాషియంసైనేడ్ విషం తీసుకుని మరణించాడని చెప్పింది సరళాదేవి. తనభర్త ఏం విషం తీసుకున్నది ఆమెకెలా తెలుసు? ఆ విషంపేరు మనకూ తెలియదు. డాక్టర్‌రిపోర్టులోగాని అది బయటపడదు.అప్పుడే నా అనుమానం ఆవిడమీదకు మళ్ళింది. దేవదాసు సినిమా పూర్తిగా చూసి వచ్చానని ఆవిడ చెప్పింది అబద్ధం. ఆవిడ టిక్కెట్టు కొనుక్కున్నమాట వాస్తవం కాని సినిమాకు వెళ్ళలేదు. రాజు ఆ సినిమాకు వెళ్ళాడు అదేరోజు. ఆ థియేటర్లో ప్రొజెక్టర్ చెడిపోయి ఎనిమిదింటికే అందరినీ పంపించివేశారు.మరుసటిరోజు ఉచితంగా ప్రదర్శిస్తామని చెప్పిపంపారు. రాజు సినిమా నుంచి వచ్చి ఫోంచేసి మేం మాట్లాడుకుంటూ వుండగా నీ ఫోన్ వచ్చింది. ఈ రెండు కారణాలచేత ఆవిడమీద అనుమానంబలపడింది. రాజుని పంపించి ఆమెను గురించి వివరాలు సేకరించమన్నారు. ముసలి భర్తతో సుఖం దొరకని ఆమె అడ్డదారులు తొక్కింది. భాస్కర్ అనే మెడికల్ రిప్రజెంటేటివ్‌తో సంబంధం పెట్టుకుంది. ఆ రాత్రి సినిమా టిక్కెట్టుకొని సినిమాకు వెళ్ళకుండా ప్రియుని రూమ్‌కు వెళ్ళి పదిగంటలకు యింటికి వెళ్ళింది. భర్తను శాశ్వతంగా వదుల్చుకుంటే ఆస్తిని అనుభవించవచ్చనీ, తన ప్రియుడితో సుఖపడవచ్చనీ ఆత్యాశకు పోయింది. అందుకే తను ఇంటి నుంచి బయలుదేరేముందు, భర్త ప్రతిరోజూ త్రాగే మంచుసీసాలో తన ప్రియుడి ద్వారా సంపాదించిన విషాన్ని కలిపింది. ప్రతిరాత్రి ఎనిమిది గంటలకు తనభర్త ఆ మందు త్రాగడం అలవాటుకాబట్టి, తను సినిమాహాల్లో వున్నట్టు ఎలిబీ వుంటుందికాబట్టి, ధైర్యంగా యీ సాహసానికి ఒడిగట్టింది. కాని దోషికి దండన తప్పదు అన్నసూక్తి మరిచిపోయింది. అందుకే పట్టుబడిపోయింది." అని ముగించాడు యుగంధర్!

—ఇ.టి. రామారావు

(శ్రీహరికోట)

## హంతకురాలవు నువ్వే!

ఇది చాలా కాలం క్రితం విషయం.

యుగంధర్ పూర్ణాలో ఒక పెట్రోలు బంకు యజమాని హత్యకేసు దర్యాప్తు చేస్తున్నప్పటిది.

ఒకనాడు యుగంధర్ ఆఫీసులో ఫోన్ మ్రోగింది.

"హలో! నేను! సరళాఫ్యూయల్ సర్వీసు యజమాని విజయ్ భార్యను మాట్లాడుతున్నాను. నా భర్త హత్యచేయబడ్డాడు. మీరు వెంటనే రావాలి" అని, ఆమె ఒక ఇంటి ఎడ్రస్ చెప్పింది.

* * *

ఇంటిముందు జనం ఉన్నారు. గేటుదాటి యుగంధర్ హత్యజరిగిన ప్రదేశం (గది) చేరుకున్నాడు. శవం ఇంకా చెడిపోలేదు. కడుపులో కత్తిదిగి ఉంది. హతుడు శరీరం మీద దుస్తులు పరిశీలించాడు. యుగంధర్. ఒకసారి గదంతా నిశితంగా పరిశీలించాడు. ఆ గది ఇంటికి ఒక ప్రక్కగా వుంది. కిటికీ తెరచి ఉంది. నేలను చేత్తో తాకి చూశాడు. తన అనుమానం ధృఢమైంది. కొద్దిసేపట్లోనే శవం పోస్టుమార్టంకు పంపబడింది.

* * *

యుగంధర్ ఫోన్ ప్రక్కన కూర్చుని ఫోన్‌కాల్ గురించి చూస్తున్నాడు. ఉదయం హత్య జరిగిన స్థలంనుంచి నేరుగా ఊళ్ళో వున్న అన్ని ఐస్‌ఫ్యాక్టరీలు తిరిగాడు. తనకు కావలసిన క్లూ దొరికింది.

ఇంతలో ఫోన్ మ్రోగింది "హలో ఇన్‌స్పెక్టర్ స్పీకింగ్"

"చెప్పండి. నేను యుగంధర్"

"సార్ మీరూహించినది కరెక్ట్, హత్య కత్తిపోటు మూలంగా జరగలేదు. అంతకు ముందు అంటే ఉదయం సుమారు 6. 30 నుండి 7 గం॥ మధ్యకాలంలో హతుడు మరణించాడు" అంటూ పోస్టుమార్టం వివరాలు చెప్పాడు.

"అయితే వెంటనే సరళాదేవిని అరెస్టు చేయండి."—

* * *

"నో. ఈ హత్య నేను చేయలేదు. ఆ సమయంలో నేను మా వీధి చివర పాల బూత్ వద్ద వున్నాను. 6-15 తర్వాత అట్నుంచటే గవర్నమెంటువారి షిప్ కేంటిన్‌వద్దకు వెళ్ళాను. అది ఉదయం 8 గం॥ వరకు ఉంటుంది. కావలిస్తే రెండు చోట్ల నిరూపించగల్ను"- ఆవేశంగా అంది సరళాదేవి.

"కాని మీరూ, మీ ప్రియుడు రాత్రి ఐస్‌ఫ్యాక్టరీనుంచి మంచుగడ్డలు తెచ్చారు. నేను తెలుసుకున్నాను. తెల్లవారి 8 గం॥ ప్రాంతంలో హతుణ్ణి తాళ్ళతో బంధించి చుట్టూ మంచుగడ్డలు పేర్చారు. దాని మూలంగా హతుడు మరణించాడు. చేతికట్లు చర్మాన్ని కోసేశాయి. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం శరీరంలో కత్తి దిగకముందే రక్తం ఘనీభవించింది. ఇన్వెస్టిగేషన్ కన్ఫ్యూజింగ్‌గా వుండాలని మీరు అతితెలివి ప్రదర్శించారు. కాని దొరికిపోయారు. అందువలన హత్యాసమయంలో నువ్వక్కడ లేకపోయినా, హత్యచేసింది నువ్వే" చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

తర్వాత సరళాదేవి నిజం చెప్పింది. తన ముసలి భర్తంటే తనకు ఇష్టంలేదు. తన ప్రియుడుతో కలిసి సుఖంగా వుండా

స్రవంతి నెం: 6లో ఇచ్చినవాక్యం

"హత్యా సమయంలో నువ్వక్కడ లేకపోయినా ఈ హత్య చేసింది నువ్వే" చెప్పాడు డిటెక్టివ్ యుగంధర్ సరళాదేవితో.

ఆధారంగా రాసిన కథలు

లని చేసిన ప్రయత్నం. హతుడు మరణించాక వేలిముద్రలు పడకుండా కత్తి దించారు. గదిలో నీళ్ళు మొత్తం గుడ్డతో తుడిచి ఫాన్ వేశారు. కాని గచ్చులో చల్లదనం తగ్గలేదు. హతుడి దుస్తులు మార్చి వేరే దుస్తులు వేశారు కాని అండర్ వేర్ తడిగా వుంది. దాన్ని మార్చలేదు. తర్వాత కత్తి దించారు. కాని రక్తం ఎక్కువగా చిందలేదు, దుస్తులు శుభ్రంగా ఉన్నాయి. ఈ విషయాలే యుగంధర్‌కు అనుమానం రేపాయి. ●

—భాస్కర్

## ఓ కథ రాయండి

ఈ కింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అర్ పేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్థమైన కథా రచయితలకి పాతికరూపాయలు పారితోషకం పంపబడుతుంది.

"తమ్ముడూ నీ పెళ్ళయితేనే కానీ నేను చేసుకోనురా" అన్నాడు సుధాకర్.

అడ్రస్ :
ఓ కథ రాయండి
స్రవంతి వారపత్రిక.
6-3-1099/2 రాజ్ భవన్ రోడ్,
సోమాజిగూడ, హైదరాబాద్-500 482.

## కనుకోండి చూద్దాం

● ఒక ప్రధానికి అల్లుడు, ఇంకో ప్రధానికి మొగుడు, మరో ప్రధానికి తండ్రి ఎవరు ?

సమాధానం : ఫిరోజ్ గాంధీ

—సి. వెంకటేశ్వరరెడ్డి
(బండి ఆత్మకూరు)

● అద్దం వుంది కానీ, చూచుకొనేది కాదు
దేశమంతా చూపిస్తాను కానీ, మ్యాప్ కాదు
కొన్ని వందలమంది చూడొచ్చుకానీ, సినిమాకాదు
కనిపిస్తాను కానీ- పట్టుకొంటే మాత్రం చిక్కను.

సమాధానం : టి. వి.

—వి. లక్ష్మి నాగేశ్వరరావు
(హజూర్ నగర్)

## మీరేం చేస్తారు ?

'స్రవంతి' నెం. 6లో 'మీరేంచేస్తారు?' లో ఇచ్చిన లక్షరూపాయల "భాగ్యలక్ష్మి" లాటరీ టికెట్టు మీకు తగిలితే?" విషయానికి ఎన్నికైన సమాధానాలు. మొదటి ఇద్దరికి ఒక్కొక్కరికి పదిరూపాయలపారితోషికం.

* భాగ్యలక్ష్మి లాటరీ నాకు తగిలి డబ్బు నాచేతికి రాగానే నా అభిమాన రచయిత యండమూరిగారి దగ్గరికి వెళ్ళి ఆయన "ఊఁ" అనేదాకా బ్రతిమాలి ఒప్పించి ఆయన సంపాదకత్వంలో "అవంతి" అనే వార పత్రికను ప్రారంభిస్తా. దాని ఖరీదెంతో తెలుసా! కేవలం యాభై పైసలు మాత్రమే. యండమూరిగారి సంపాదకత్వం, యాభై పైసల ఖరీదు. అపుడు స్రవంతి సర్క్యులేషన్...? వ్వె వ్వె వ్వె!!!

—వందన, (రామగుండం)

* తగిలిందని తెల్సిన వెంటనే స్పృహ తప్పి పడిపోతాను. ఆనక 50 వేలకి రిక్షాలు కొని, మా బంధువులందరికి సరఫరా చేస్తాను. 10 వేలకి బార్బర్ షాపులలోని పనికిరాని బొచ్చునంతా కొనేసి ఇంట్లో పరిచేసి, దానిపై పెద్ద టార్పాలిన్ పరిచి పడుకొని, నా చిరకాల వాంఛను తీర్చుకుంటాను. మరో 10 వేలిచ్చి అన్ని శ్మశానాల్లోని కాటికాపరులద్వారా పుర్రెలు ఎముకలు కొని ఇంట్లో అలంకారంగా ఉంచుకొని నా మరో చిరకాల వాంఛ తీర్చుకుంటాను. మిగిలిన 30 వేలలో 15 వేలకి గాడిదలను కొనేసి జంతువులపై నాకున్న ప్రేమాభిమానాలను చాటుకుంటాను. నా బ్రిలియంట్ బ్రెయిన్ చూసి అందరూ అసూయపడితే గర్విస్తాను!

—బి. మధుసూధన్ రావ్
(పులివెందుల)

* లక్ష రూపాయల భాగ్యలక్ష్మి లాటరీ టికెట్టు తగిలితే?

ఏమన్నారు 'భాగ్యలక్ష్మి లాటరీ టికెట్టు' నాకు తగిలితేనా!

"గుండె ఆగి అక్కడే చనిపోతా!"

—మహేష్ షా (ఆదోని)

* అంతకు ముందు లాటరీ టిక్కెట్లు కొనడానికి తీసుకున్న డబ్బులు అప్పు తీర్చేస్తాను-కొంత అప్పుఅయినా తగ్గుతుందే!

—కొణిజేటి బాలబ్రహ్మచారి
(ఒంగోలు)

* లక్ష రూపాయలు భాగ్యలక్ష్మిలాటరీ టికెట్ తగిలితే!

నాకు లచ్చ లాట్రీలో తగిలిందనుకోండి దాంట్లోంచి టాకుసని, కమిషనని గెంతో కోసుకుంట్రంట గద. గట్లగోస్తె వొప్పు కోను. మరింగెలా లచ్చ తీస్కుంట నంట్రూ.

గేయంది తెలుగు గడ్డమీద లచ్చలు లచ్చలతో యాపారం జేస్కుండే టోళ్ళు మస్తుమందుండ్రి

గటు వంటోళ్ళు లచ్చ ఇత్తరంట.

గిట్నుండి టికెట్టిత్త. గట్నుండి లచ్చ తీస్కుంట గంతే

—ఎమ్. శ్రీనివాస్ రావు (ఖమ్మం)

## వడ్డేపల్లి పదాలు



సప్తదేశ అధినేతల
'సార్క్' సంగమం వల్ల
విభేదాలు సమసిపోతె
శుభాలే జగానికెల్ల

●

తీవ్రవాదు లటువైపున
పోలీసులు ఇటువైపున
అయ్యయ్యో! లాఠీలు
అమాయక ప్రజ వీపున



## అభిప్రాయం

"స్రవంతిపై నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు ఉత్సాహరావ్.

"ఏముంది! పాఠకులకు ఆనందం, పోస్టల్ డిపార్టుమెంట్‌కు, ఆదాయం!" జవాబిచ్చాడు ఆనందరావ్.

—టి. ఖాదర్ భాషా (తెనకల్లు)

## స్రవంతి ధర రూపాయే!

స్రవంతి పత్రిక వెల పెంచకూడదన్న గట్టి నిర్ణయంతో కలర్ పేజీలు తగ్గించడం జరిగిందని పాఠకులు గమనించ ప్రార్థన.

—సంపాదకుడు.